ఓయూలో కాన్షీరాం వర్ధంతి



కాన్షీరాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఎస్‌యూ నేతలు

లాలాపేట: ధర్మ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద బహుజన రాజ్యాధికార పితామహుడు కాన్షీరాం 19వ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు కాన్షీరాం చిత్రపటానికి పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ అంబేడ్కర్ నిజమైన వారసుడు కాన్షీరాం అని, ఆయన ఆశయ సాధనకు విద్యార్థులు, యువత కలిసి రావాలని పిలుపునిచ్చారు. డీఎస్‌యూ రాష్ట్ర కన్వీనర్ కార్తీక్ మహారాజ్, ప్రసాద్ బొలంపల్లి, ఉదయ్ కిరణ్, ప్రశాంత్, పవన్, నవీన్, మధుకర్, రమేశ్ తదితరులున్నారు.

రాధకు డాక్టరేట్



పీహెచ్‌డీ గ్రంథాన్ని డా. విజయ్‌కుమార్‌కు అందజేస్తున్న రాధ

లాలాపేట: మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ బోట్లగడ్డ తండాకు చెందిన పాత్లావత్ రాధ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాను అందుకుంది. ఈ మేరకు ఓయూ ఆర్ట్స్ కాలేజీ హిందీ విభాగం హెడ్ ప్రొ. మాయాదేవి మార్గదర్శకత్వంలో గోల్కొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిందీ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొ. డా. విజయ్‌కుమార్ జాదవ్ నిర్దేశకత్వంలో సమకాలీన్ హిందీ ఉపన్యాసోమే నారీ పాత్ర కా మనో విశ్లేషణ్ అనే అంశంపై రాధ సమగ్రమైన పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఇందుకుగాను యూనివర్సిటీ పరీక్షల విభాగం అధికారులు రాధకు పీహెచ్‌డీ పట్టాను అందజేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌డీ డాక్టరేట్ పొందిన రాధ మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ జిల్లా మారుమూల ప్రాంతం తండా నుంచి తాను ఉన్నత స్థాయి ఓయూ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు.

కార్పొరేటర్ కంది శైలజ హౌస్ అరెస్ట్



బౌద్ధనగర్: ఆర్టీసీ బస్ ఛార్జీలు పెంపు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నిర్వహించిన చలో బస్ భవన్ నేపథ్యంలో డివిజన్ కార్పొరేటర్ కంది శైలజను పోలీసులు గురువారం ఉదయం హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజలపై భారంగా మారిన బస్ ఛార్జీల పెంపును ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. ప్రజల ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఇది అన్యాయం అని పేర్కొన్నారు. శాంతియుతంగా నిరసన తెలియజేయాలన్న ఉద్దేశంతో బయటకు రావడాన్ని పోలీసులు అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమెతో పాటు రాజేశ్, పాక సాయి తదితరులు హౌస్ అరెస్టులో ఉన్నారు.

పదోన్నతుల సమస్యలను పరిష్కరించాలి



లాలాపేట: ఇటీవల ఓయూలో నిర్వహించిన సీఏఎస్ ఇంటర్వ్యూల్లో పదోన్నతులు లభించిన పలువురు అధ్యాపకులు ఔటా ఆధ్వర్యంలో గురువారం ఓయూ రిజిస్ట్రార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. యూనివర్సిటీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా దాదాపు 48 మంది అధ్యాపకులను సీఏఎస్ ఇంటర్వ్యూల్లో చిన్న చిన్న కారణాలతో రిజెక్టు చేశారని ఇది యూనివర్సిటీ ప్రతిష్టకు భంగం కలిగేలా ఉందన్నారు. అధ్యాపకుల ప్రమోషన్స్ ఇంటర్వ్యూల్లో జరిగిన పొరపాట్లను వెంటనే సరి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఔటా నాయకులు రిజిస్ట్రార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఔటా అధ్యక్షుడు ప్రొ. మనోహర్, జనరల్ సెక్రటరీ ప్రొ. సురేందర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ ప్రొ. టి. గంగాధర్, జె. రామ్‌చందర్, సురేశ్, శ్రీనివాస్ నాయక్, డాక్టర్ నతానియేల్, అరవింద్, రామకృష్ణ, వెంకటేశ్వర్‌రావు, శివకుమార్ తదితరులున్నారు.

ప్రెసిడెంట్ కప్ ఆవిష్కరణ

లాలాపేట: జాతీయ కరాటే చాంపియన్‌షిప్, ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్–2025కు సంబంధించిన బ్రోచర్, ప్రెసిడెంట్ కప్‌ను టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తన నివాసంలో ఇటీవలే ఆవిష్కరించారు. కరాటేకు జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు ఉందన్నారు. గురువారం ఈ సందర్భంగా నిర్వాహకులు కరాటే ఫెడరేషన్ ఆఫ్ షాటోఖాన్ ఇండియా ప్రెసిడెంట్ గణేశ్ గడియారం మాట్లాడుతూ.. వచ్చే నెల నవంబర్ 15, 16 తేదీల్లో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో కేఎఫ్‌ఎస్ ఇండియా ఆధ్వర్యంలో ఈ ప్రెసిడెంట్ కప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, కేఎఫ్ఎస్ తెలంగాణ చైర్మన్ పి.రామకృష్ణారావు, తెలంగాణ ప్రెసిడెంట్ రాజిరెడ్డి, అడ్వయిజరీ కమిటీ చైర్మన్ లయన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మనోజ్‌కుమార్ యాదవ్ తదితరులు ఉన్నారు.



ప్రెసిడెంట్ కప్పుతో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

అస్తవ్యస్తంగా రోడ్లు

- బేగంపేట్ సర్కిల్ పరిధిలో అవస్థలు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. గోతులమయంగా మారిన రోడ్లపై నుంచి రాకపోకలు సాగించడం కష్టతరంగా మారిందని జనం వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పలు రోడ్లు గుంతలమయమై అధ్వానంగా అయ్యాయి. జీహెచ్‌ఎంసీ బేగంపేట్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్లు శిథిలావస్థలకు చేరుకొని ప్రజలు ఇబ్బంది పడుతున్నా ఇంజనీరింగ్ విభాగం అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో రోడ్ల దుస్థితిని తెలుసుకొని మరమ్మతులు చేయాల్సిన సిబ్బంది, అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రజలకు తిప్పల్లు తప్పడం లేదు. సర్కిల్ పరిధిలో రోడ్ల తాత్కాలిక మరమ్మతుల కోసం ఆటోట్రాలీ వాహనాలను ఏర్పాటు చేశారు. అందులో సిబ్బంది, మెటీరియల్ వంటి సామగ్రిని కూడా ఉంటుంది. అయితే సదరు సిబ్బంది పూర్తిస్థాయిలో పనిచేయకపోవడంతో రోడ్లు ఎందుకు పనికి రాకుండా మారాయి. గతుకులమయమైన రోడ్ల గుండా రాత్రి వేళల్లో రోడేదో.. తెలియక వాహనదారులు అందులో పడి ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో కోకొల్లలుగా ఉంటున్నాయి. బేగంపేట్ సర్కిల్ పరిధిలోని డివిజన్ స్థాయిలో ఇంజనీరింగ్ విభాగం ఏఈ, డిప్యూటీ ఈఈ, ఈఈలు ఉన్నా రోడ్ల రూపురేఖలు మాత్రం మారడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. సదరు అధికారులు ఆఫీసులకు మాత్రమే పరిమితమై విధులు నిర్వర్తిస్తుండటంతో క్షేత్రస్థాయి సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా దర్శనమిస్తున్నాయి.



బోయిగూడ కట్టెలమండి ప్రాంతంలో రోడ్డు దుస్థితి

రోడ్లు గతులమయంగా మారడంతో ట్రాఫిక్‌కు విఘాతం కలుగుతుంది. సదరు రోడ్ల గుండా వాహనాలు నెమ్మదిగా వెళ్తుండటంతో ప్రజలకు తిప్పల్లు తప్పడం లేదు. రోడ్ల మరమ్మతుల కోసం తాత్కాలిక వాహనాలు ఏర్పాటు చేసి కాంట్రాక్టర్లకు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నా ప్రజలకు మాత్రం ఆ స్థాయిలో మేలు జరగడం లేదనే ఆరోపణల హేతుబద్ధతను కాదనలేనిది.

రోడ్లు అధ్వానంగా మారిన చోట్లు..

ఆర్పీ రోడ్డు హోండా షో రూమ్ సమీపంలో ప్రధాన రహదారిలో భారీ గోతు ఏర్పడింది. దీంతో ఈ రహదారి గుండా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు నరకం చూస్తున్నారు. నెలల తరబడి నుంచి ప్రజలు ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. బోయిగూడ ఫ్లోరా హోటల్ సమీపంలో మెట్రో పిల్లర్ కింద రోడ్డు గుంతమయంగా మారింది. నిత్యం ప్రజల సందడితో రద్దీగా ఉంటే ఈ ప్రాంతాల్లో రోడ్లు పాడైపోవడంతో ప్రజల అవస్థలు అన్నీ ఇన్నీకావు. మోండా మార్కెట్, బోలక్‌పూర్, రాణిగంజ్, ఓల్డ్‌బోయిగూడ, బన్సీలాల్‌పేట్, పాట్ మార్కెట్, బండిమేట్, చాచానెహ్రూనగర్, కట్టెలమండి, అరుణ్‌జ్యోతి కాలనీ, దేవీనగర్, గాంధీనగర్, జీరా, హైదర్‌బస్తీ ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి.



ఆర్పీ రోడ్డు ప్రధాన రహదారిలో..

రోడ్ల మరమ్మతులకు చర్యలు: డిప్యూటీ కమిషనర్ డాకు నాయక్

రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని బేగంపేట్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ డాకు నాయక్ చెప్పారు. పాడైపోయిన రోడ్లకు యుద్ధప్రాతిపదికను మరమ్మతులు చేస్తామన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చాలా చోట్ల తారురోడ్లు దెబ్బతిన్నాయని చెప్పారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పాడైపోయిన రోడ్లకు మరమ్మతులు చేసేలా తమ ఇంజనీరింగ్ సిబ్బంది ఆదేశాలు ఇస్తామన్నారు. గోతులమయంగా మారిన రోడ్ల కారణంగా ఇబ్బంది పడితే వెంటనే ప్రజలు తమ దృష్టికి తీసుకొస్తే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

360 మంది విద్యార్థినులకు ఏఐ శిక్షణ

సనత్‌నగర్: డెల్ టెక్నాలజీస్ సహకారంతో లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 'ఉమెన్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (డబ్ల్యూ అండ్ ఏఐ)పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో వివిధ విభాగాలకు చెందిన 360 మంది విద్యార్థినులు శిక్షణ పొందారు. దీని ద్వారా పవర్ బీఐ, అడ్వాన్స్‌డ్ ఎక్సెల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), సైబర్ సేఫ్టీ, సాఫ్ట్ స్కిల్స్ వంటి ఆధునిక టెక్నాలజీలో శిక్షణ పూర్తి చేశారు. శిక్షణ పొందిన విద్యార్థులకు గురువారం సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సృజనాత్మకంగా రూపొందించిన ఏఐ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఏఐ ఇమేజ్ ఎడిటింగ్ టూల్, బ్రెస్ట్ క్యాన్సర్ గుర్తింపు వ్యవస్థ, పవర్ బీఐ డాష్‌బోర్డు వంటి ప్రాజెక్టులు విద్యార్థినుల్లోని సాంకేతికతకు, సృజనాత్మకతకు అద్దం పట్టాయి. అలాగే కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు స్వచ్ఛమైన మంచినీటిని అందించేందుకు డెల్ టెక్నాలజీ కళాశాల ప్రాంగణంలో 1000 లీటర్ల సామర్థ్యం కలిగిన మంచినీటి ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. దీనిని కూడా డెల్ టెక్నాలజీస్ వైస్ ప్రెసిడెంట్ రమేశ్, సీనియర్ డైరెక్టర్ సుజయ్ థామస్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి, టీఎస్‌కేసీ కో–ఆర్డినేటర్ శారదాదేవి తదితరులు ప్రారంభించారు.



మంచినీటి ప్లాంట్‌ను ప్రారంభించిన డెల్ టెక్నాలజీ, కళాశాల ప్రతినిధులు

ఆత్యాధునిక వైద్యవిధానాలతో అభివృద్ధి




ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు సర్టిఫికెట్ అందిస్తున్న గాంధీ ప్రిన్సిపాల్ ఇందిర

గాంధీఆస్పత్రి: ఆధునిక విధానాలతో వైద్యవిద్యా ప్రమాణాలు ఎంతో మెరుగుపడతాయని పలువురు వైద్యనిపుణులు అన్నారు. గాంధీ మెడికల్ కాలేజీ రీజనల్ ట్రైనింగ్ సెంటర్‌లో 'బేసిక్ కోర్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్' అంశంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. ఆత్యాధునిక వైద్యవిధానాలు, నూతన మెళకువలు, అపారమైన అనుభవం, వృత్తినైపుణ్యంతో తెలంగాణ వైద్యరంగం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. దేశవ్యాప్తంగా వైద్యవిద్య ప్రమాణాలను మెరుగుపర్చేందుకు కాంపిటెన్సీ బేస్డ్ మెడికల్ ఎడ్యుకేషన్ (సీబీఎంఈ) సదస్సులు తరుచు నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. విజయవంతంగా సదస్సును నిర్వహించిన రీజనల్ సెంటర్ నిర్వాహకులకు అభినందించారు. తెలంగాణ వ్యాప్తంగా ఎనిమిది నెలల్లో సుమారు 300 మందికి శిక్షణ ఇచ్చినట్లు గాంధీ రీజనల్ ట్రైనింగ్ సెంటర్ కన్వీనర్ ప్రొఫెసర్ కిరణ్‌మాదల తెలిపారు. అనంతరం రీజనల్ సెంటర్ పరిధిలోని 25 ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల నిర్వాహకులకు సర్టిఫికెట్లు, ప్రశంసపత్రాలు అందించారు. కార్యక్రమంలో గాంధీ, ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్స్ ప్రొ. ఇందిర, ప్రొ. రాజారావు, గాంధీ సూపరింటిండెంట్ ప్రొఫెసర్ వాణి, వైస్ ప్రిన్సిపాల్ రవిశేఖరరావు, జనరల్ సర్జరీ హెచ్‌ఓడీ రాజారామ్, రీజనల్ సెంటర్ కన్వీనర్ కిరణ్‌మాదల, కోకన్వీనర్ సుబోధ్‌కుమార్, ఫ్యాకల్టీలు తిరుపతిరావు, అనీల్, జుబేర్, సృజన, హిమబిందు, ఆయా కాలేజీల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఓయూలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

లాలాపేట: తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ క్లినికల్ సైకాలజిస్టులు, ఓయూ సైకాలజీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం వరల్డ్ మెంటల్ హెల్త్ డేను పురస్కరించుకొని ఓయూ ఆర్ట్స్ కళాశాలలో' మానవతా సంక్షోభాల సమయం మానసిక ఆరోగ్యం వాటాదారులను సమన్వయం చేయడం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ కాశీం , పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రాథమిక విద్యా స్థాయి నుంచే మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడం ద్వారా విద్యార్థుల్లో కలిగే ఆందోళనలకు పరిష్కారాలను చూపించవచ్చునన్నారు. మానసిక ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేయడానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సైక్రియాట్రిస్ట్ డా. ఎంవీఆర్ శర్మ, ఓయూ సైకాలజీ విభాగం హెడ్ డా. స్వాతి, డా. అనుపమ, డా. శ్రీకృష్ణ, టీఏసీపీ ప్యాట్రన్ డా. వృశాలి రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శిల్పా పన్నాల, సెక్రటరీ పి. అంజన్‌కుమార్, గీత, శోభా, అనుప్రియ, జాతీయ అవార్డు గ్రహీత డా. సరోజ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.



అవగాహన సదస్సులో పాల్గొన్న సైకాలజిస్టులు

మద్యం దుకాణాలకు గెజిట్ నోటిఫికేషన్

18 లోపు దరఖాస్తు చేసుకోండి: సికింద్రాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జగన్మోహనరెడ్డి

సనత్‌నగర్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ 2025–27 సంవత్సరానికి గాను కొత్త మద్యం దుకాణాలకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. సికింద్రాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలో నూతనంగా లైసెన్స్ పొందడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ జగన్మోహనరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2025 డిసెంబర్ 1 నుంచి 2027 నవంబర్ 30వ తేదీ వరకు రిటైల్ మద్యం షాపుల నిర్వహణకు ఈ దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. 2 ఏళ్ల వయస్సు పైబడిన ఆసక్తి కలిగిన ఎవరైనా సరే ఈ నెల 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు రూ.3 లక్షలు (నాన్ రిఫండబుల్) చెల్లించాలన్నారు. లాటరీ విధానం ద్వారా షాపు కేటాయింపు పొందిన వారికి లైసెన్స్ రెండేళ్ల పాటు చెల్లుబాటు అవుతుందని, నాంపల్లిలోని అబ్కారీ భవన్‌లో దరఖాస్తులను అందించాలన్నారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–10లోని బాబూజగ్జీవన్‌రామ్ భవన్‌లో ఈ నెల 23న ఉదయం 11 గంటలకు డ్రా నిర్వహిస్తామని తెలిపారు.

సెట్ పరీక్ష ఫీజును తగ్గించాలి

లాలాపేట: స్టేట్ ఎలిజిబులిటి టెస్ట్(టెట్) పరీక్ష ఫీజును తగ్గించాలని ఓయూ ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సెట్ కన్వీనర్ ప్రొ. శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జాతీయ స్థాయిలో నిర్వహించే నెట్(నేషనల్ ఎలిజిబులిటీ టెస్ట్)కు జనరల్ అభ్యర్థులకు రూ. 1100, బీసీ అభ్యర్థులకు రూ. 600, ఎస్సీ, ఎస్టీలకు రూ.320 పరీక్ష ఫీజు రుసుము ఉందన్నారు. కానీ రాష్ట్రస్థాయిలో నిర్వహించే సెట్‌కు పరీక్ష రుసుకు అధికంగా జనరల్ అభ్యర్థులకు రూ. 2000, బీసీలకు రూ.1500, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000 ఫీజు పెట్టడం వలన బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు భారంగా మారిందన్నారు. అధికారులు అందరికి అందుబాటులో ఉండేలా పరీక్ష రుసుము తగ్గించాలని కోరారు. నెట్, సెట్ పరీక్షల తేదీలు ఒకేసారి కాకుండా వేర్వేరుగా ఉండేలా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ ఏబీవీపీ విద్యార్థి నేతలు పాల్గొన్నారు.

బీసీలను మోసం చేసిన కాంగ్రెస్

లాలాపేట: బీసీ రిజర్వేషన్‌ల పేరుతో కాంగ్రెస్ నాయకులు పూటకో మాట మాట్లాడుతూ.. ఘరానా మోసం చేస్తున్నారని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య అన్నారు. గురువారం ఆయన ఓయూలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి బీసీ 42 శాతం అసాధ్యమని తెలిసి గారడి చేశారని మండిపడ్డారు.

బీసీ రిజర్వేషన్లపై స్టే ఇవ్వడం బాధాకరం

లాలాపేట: న్యాయమైన డిమాండ్ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడం బాధాకరం అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పెంచుతూ అన్ని రాజకీయ పార్టీల సమ్మతితో రాష్ట్ర ప్రభుత్వం జీవో 9న జారీ చేసిందన్నారు. కొంత మంది తమ రిజర్వేషన్లను అడ్డుకోవడం సరికాదన్నారు.

తలసాని క్యాంప్ కార్యాలయం వద్ద హైడ్రామా

హౌస్ అరెస్టుతో పోలీసులతో ఎమ్మెల్యే వాగ్వాదం

సనత్‌నగర్/రాంగోపాల్‌పేట: వెస్ట్‌మారేడ్‌పల్లిలోని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ క్యాంప్ కార్యాలయం వద్ద కొద్దిసేపు హైడ్రామా చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్సు ఛార్జీల పెంపును వ్యతిరేకిస్తూ గురువారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చలో బస్‌భవన్ కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో నగరంలోని ఎమ్మెల్యేలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఇందులో భాగంగా వెస్ట్‌మారేడ్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయానికి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ వచ్చిన విషయం తెలుసుకున్న మారేడ్‌పల్లి పోలీసులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. హౌస్ అరెస్టుకు ఉన్నతాధికారులు ఆదేశించారని ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ తాము ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు చేయడం లేదని, బస్సులో బస్‌భవన్ వరకు వెళ్తామని వివరించారు. దీంతో పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎమ్మెల్యే వెంట నాయకులు శ్రీహరి, నరేందర్‌రావు తదితరులు ఉన్నారు.



పోలీసులు హౌస్ అరెస్టు చేయడంతో ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

దృష్టి సమస్యలపై అప్రమత్తం



అవగాహన కార్యక్రమంలో గురువారెడ్డి, పృధువ్యాస్ తదితరులు

సనత్‌నగర్: ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా బేగంపేటలోని కిమ్స్–సన్‌షైన్ హాస్పటల్‌లో గురువారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ ఏవీ గురువారెడ్డి మాట్లాడుతూ.. అంధత్వంతో బాధపడుతున్న వారి జీవితాన్ని ఎలా కొనసాగిస్తారో చెప్పడం చాలా బాధాకరమన్నారు. సృష్టి అందించిన అద్భుతమైన ప్రకృతిని, అద్భుతాలను చూడలేని వారికి ఆధునిక కంటి వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో కిమ్స్ సన్‌షైన్ ఐకేర్ సెంటర్‌ను బేగంపేటలో ప్రారంభించామని తెలిపారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆప్తమాలజీ డాక్టర్ ఎస్‌టీఎస్ పృధువ్యాస్ మాట్లాడుతూ ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా 'మీ కళ్లను ప్రేమించండి' థీమ్‌తో క్రమం తప్పకుండా కంటి పరీక్షలు నిర్వహించుకుంటూ దృష్టిని కాపాడుకోవాలన్నారు. దృష్టికి అనుకూలమైన అలవాట్లను ప్రోత్సహించాలని సూచించారు. భారతదేశంలో 12 మిలియన్లకు పైగా అంధులు ఉన్నట్లు కొన్ని నివేదికల ప్రకారం తెలుస్తుందన్నారు. ఇటీవల కాలంలో భారతదేశంలో స్క్రీన్ సమయం పెరగడం వల్ల అన్ని వయస్సు వారిలో కంప్యూటర్ విజన్ సిండ్రోమ్ డిజిటల్ ఐ స్ట్రెయిన్ అని పిలువబడే స్క్రీన్–ప్రేరిత దృష్టి సమస్యలు పెరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో కిమ్స్ సైన్‌షైన్ ఐకేర్ అత్యాధునిక వైద్య సేవలను అందించే లక్ష్యంతో కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కుషాల్, సీఓఓ సుధాకర్‌జాదవ్, కన్సల్టెంట్ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ వెంపాటి వీఎస్ఎన్ జ్యోతి, డాక్టర్ విష్ణు ప్రీతి తదితరులు పాల్గొని అవగాహన కల్పించారు.

జీవనశైలిలో మార్పులతో కంటి సమస్యలు నియంత్రణ

గాంధీఆస్పత్రి: జీవనశైలి మార్పులతో కంటి సంబంధ సమస్యలను నియంత్రించవచ్చని గాంధీ ఆప్తమాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ రవిశేఖరరావు అన్నారు. ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని (వరల్డ్ సైట్ డే) పురస్కరించుకొని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో గాంధీ ఆప్తమాలజీ విభాగం, జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం పలు అవగాహన కార్యక్రమాలు, చైతన్యర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానసిక ఒత్తిడి, కంప్యూటర్, సెల్ ఫోన్‌ల వినియోగం, మారుతున్న ఆహారపు అలవాట్లు వలన కంటి సంబంధ రుగ్మతలు నానాటికీ పెరుగుతున్నాయన్నారు. దృష్టి ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకునేందుకు తరుచు కంటి పరీక్షలు చేయించుకోవాలని, గ్లోకోమా క్షీణత, డయాబెటిక్ రెటినోపతి వంటి సమస్యలను ముందుగానే గుర్తిస్తే నియంత్రణ సులభమన్నారు. విటమిన్ ఏ, సీ, ఈ, ఓమేగా–3, ఆమ్లాలు వంటి పోషకాలు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని, కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు ఎక్కువగా చూస్తే కంటిపై ఒత్తిడి పెరిగి దృష్టిలోపం, తలనొప్పి వస్తాయని, స్క్రీన్‌బ్రైట్‌నెస్ కంటిపై ఎక్కువగా ప్రభావం చూపిస్తుందన్నారు. శారీరక వ్యాయామంతో పాటు కంటి వ్యాయామాలు చేస్తే దృష్టిలోపాన్ని నివారించవచ్చన్నారు. గాంధీ ఆప్తమాలజీ విభాగంలో అన్నిరకాల కంటి పరీక్షలు, మందులు ఉచితంగా అందిస్తామన్నారు. ఈ ఏడాది ' మీ కళ్లను ప్రేమించండి' అనే థీమ్‌తో ప్రచార, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పలు అంశాలపై అవగాహన కల్పించి, చైతన్యర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గాంధీ ఆప్తమాలజీ వైద్యులు దీపక్‌రెడ్డి, సుజనీ, ప్రావీణ్య, సింధు, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రపంచ దృష్టి దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న గాంధీ ఆప్తమాలజీ వైద్యులు

కార్మికుల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలి



ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను కలిసిన ఎన్ఎఫ్‌సీ యూనియన్ సభ్యులు

కంటోన్మెంట్: కార్మిక సంఘాలు కార్మికుల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. మౌలాలిలోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్ఎఫ్‌సీ) అణు ఇంధన సంస్థ ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ నూతన పాలకవర్గ సభ్యులు గురువారం పికెట్ లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యూనియన్ సభ్యులు కార్మికులకు, సంస్థ యాజమాన్యానికి వారధిగా పనిచేయాలన్నారు. సంస్థల అభివృద్ధికి తగిన సహకారం అందించాలన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో యూనియన్ ప్రెసిడెంట్ దేవకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ మురళీధర్ గౌడ్, జనరల్ సెక్రటరీ రతన్ సింగ్, ట్రెజరర్ శ్యాంరావు, వైస్ ప్రెసిడెంట్‌లు యాకూబ్, కోటిబాబు, శ్రీనివాస్, హనుమంత్ ఉన్నారు.

నర్సింగ్ స్టాఫ్‌కు అలవెన్స్‌లు మంజూరు

సికింద్రాబాద్: రైల్వే ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఎల్లవేలలా కృషి చేస్తుందని యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకర్‌రావు అన్నారు. సికింద్రాబాద్‌లోని మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో గురువారం యూనియన్ నాయకులను మెడికల్ నర్సింగ్ స్టాఫ్ ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నర్సింగ్ సిబ్బంది మాట్లాడుతూ.. దక్షిణ మధ్య రైల్వేలో మెడికల్ నర్సింగ్ స్టాఫ్‌కు విద్యార్హత అలవెన్స్ అందజేయక పోవడంతో మజ్దూర్ యూనియన్ జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మురళీధర్, ప్రధాన కార్యదర్శి శంకర్‌రావుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వెంటనే స్పందించిన యూనియన్ నాయకులు సంబంధిత ఉన్నతాధికారులతో చర్చించి సుమారు 57 మంది నర్సింగ్ స్టాఫ్‌కు అలవెన్స్ మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ప్రెసిడెంట్ కాల్వ శ్రీనివాస్, ఏజీఎస్‌లు ఉదయ భాస్కర్, రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యూనియన్ నాయకులకు అభినందనలు తెలుపుతున్న మెడికల్ నర్సింగ్ స్టాఫ్

వర్కర్స్‌కు జీతాలు పెంచాలి



మాట్లాడుతున్న యూనియన్ గౌరవాధ్యక్షురాలు ఎస్ ఎల్ పద్మ

లాలాపేట: ఓయూ హాస్టల్స్ వర్కర్ల జీతాలు పెంచాలని టీయూసీఐ అనుబంధ ప్రొగ్రెసీవ్ కాంట్రాక్టు అండ్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ ఓయూ కమిటీ డిమాండ్ చేసింది. గురువారం ఓయూ రిజిస్ట్రార్, ఓఎస్డీలను కలిసి సమస్యలపై వినతి పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు, కార్మికులు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. రిటైర్ అయిన, చనిపోయిన కార్మికుల కుటుంబాలకు గ్రాట్యుటీ ఇవ్వాలని, ఇంట్లోని కుటుంబ సభ్యులకు ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. 20 రోజుల సెలవులు, యూనిఫామ్, యాప్రాన్, తదితర రక్షణ పరికరాలను అందించాలన్నారు. ఈఎస్ఐ కార్డులు, చనిపోయిన కార్మికుడికి అంత్యక్రియల నిమిత్తం రూ. 25 వేలు ఇవ్వాలన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షురాలు ఎస్ ఎల్ పద్మ, ఓయూ అధ్యక్షుడు ప్రదీప్, ప్రధాన కార్యదర్శి శివాజీ, ఆర్ శంకర్, విజయ, ఈశ్వరయ్య, జయ, సారయ్య తదితరులున్నారు.